సాక్షి
మంచిర్యాల

గురువారం ¦ 3 ¦ జూలై ¦ 2025



టేకు చెట్ల నరికివేత
జన్నారం అటవీ డివిజన్ కవ్వాల్ సెక్షన్ పరిధిలో టేకు చెట్లు నరికివేతకు గురయ్యాయి. ఈ సంఘటన జరిగి వారం రోజులైనా అటవీ అధికారులు గుర్తించకపోవడం గమనార్హం. 8లో▸



సమ్మెతో కనువిప్పు కలగాలి
ఈ నెల 9న చేపట్టనున్న సమ్మెను విజయవంతం చేసి కేంద్ర ప్రభుత్వానికి కనువిప్పు కలిగించాలని సింగరేణి కార్మిక సంఘాల జేఏసీ నాయకులు పిలుపునిచ్చారు. 8లో▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
29.0 /25.0

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. చిరుజల్లులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది. గాలులు బలంగా వీస్తాయి.

న్యూస్‌రీల్

మంచిర్యాల కమిషనర్‌గా రాజమనోహర్



రాజమనోహర్

మంచిర్యాలటౌన్: మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా బి.రాజమనోహర్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. కమిషనర్ తొటం శివాజీ ఈ నెల ఒకటి నుంచి 15వరకు వ్యక్తిగత పనిమీద సెలవుపై వెళ్లారు. ఆయన స్థానంలో రాజమనోహర్‌కు కమిషనర్‌గా పూర్తి స్థాయి అదనపు బాధ్యతలు(ఎఫ్ఏసీ) అప్పగిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. సానిటరీ సూపర్‌వైజర్‌గా ఉన్న రాజమనోహర్ ఇటీవల కమిషనర్‌గా పదోన్నతి పొంది.. మంచిర్యాల కార్పొరేషన్‌లోనే అసిస్టెంట్ కమిషనర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

మావోయిస్టులు లొంగిపోవాలని పోస్టర్లు



పోస్టర్లపై ఆరా తీస్తున్న ఎస్సై శ్యాంపటేల్

వేమనపల్లి/భీమిని: సిద్ధాంతాల కోసం అడవి బాట పట్టిన మావోయిస్టులు లొంగిపోయి జన జీవన స్రవంతిలో కలవాలని మావోయిస్టు ఆత్మ పరిరక్షణ ప్రజాఫ్రంట్ తెలంగాణ పేరిట వేమనపల్లి, కన్నెపల్లి మండలాల్లో బుధవారం పోస్టర్లు వెలిశాయి. వేమనపల్లి మండలం ప్రాణహిత సరిహద్దు గ్రామాలైన కళ్లంపల్లి, ముక్కిడిగూడెం, జాజులపేట, సుంపుటం గ్రామాల సమీప కల్వర్టులు, మిషన్ భగీరథ వాటర్‌ట్యాంకులు, సూచిక బోర్డులకు, కన్నెపల్లి తహసీల్దార్ కార్యాలయం, గ్రామీణ బ్యాంక్ ఎదుట గుర్తు తెలియని వ్యక్తులు పోస్టర్లు అతికించారు. మావోయిస్టు అగ్ర నాయకులారా మీరు నమ్మిన కాలం చెల్లిన సిద్ధాంతాలు సామాన్యుడికి ఆశాకిరణాలు ఎక్కడయ్యాయి, మీరు నమ్మిన ఉద్యమబాట ప్రజాదరణ లేక మోడుబారిన బీడు భూమి అయ్యిందని, అడవిని వీడి ప్రజల్లోకి రావాలని పోస్టర్లలో పేర్కొన్నారు. ఆయా గ్రామాల్లో వెలిసిన పోస్టర్లు కలకలం రేపాయి. వేమనపల్లి మండలంలోని గ్రామాల్లో వెలిసిన పోస్టర్లపై ఎస్సై శ్యాంపటేల్ విచారణ చేపట్టారు.

హక్కుల సాధనకు ఐక్యంగా ఉద్యమించాలి



మాట్లాడుతున్న గుర్రాల మల్లేశం

పాతమంచిర్యాల: ముదిరాజ్‌లు హక్కుల సాధన కోసం ఐక్యంగా ఉద్యమించాలని ముదిరాజ్ మహాసభ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గుర్రాల మల్లేశం అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని అన్నపూర్ణ హాల్‌లో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 60లక్షలకు పైగా ఉన్న ముదిరాజ్‌లకు రాజకీయ, విద్య, ఉపాధి రంగాల్లో అన్యాయం జరుగుతోందని తెలిపారు. ముదిరాజ్‌లను బీసీ డీ నుంచి బీసీ ఏకు మార్పు చేసే వరకు ఉద్యమిస్తూనే ఉంటామని అన్నారు. మత్స్య సంపదపై ఆధారపడి జీవించే వారికి ప్రభుత్వ రుణాలు, వస్తు సామగ్రి అందడం లేదన్నారు. ఈ సమావేశంలో ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షుడు గరిగంటి కొమురయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బల్ల సత్తయ్య, రాష్ట్ర కార్యదర్శులు టి.శ్రీకాంత్, కంకణాల సతీష్, జిల్లా ప్రధాన కార్యదర్శి సాధనబోయిన కృష్ణ, పట్టణ అధ్యక్షుడు భూతపల్లి రాజేశం, యూత్ అధ్యక్షుడు గరికె సుమన్ పాల్గొన్నారు.

వనమహోత్సవం విజయవంతం చేయాలి

కాసిపేట: మండలంలో అన్ని శాఖల సమన్వయంతో వన మహోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా పరిషత్ సీఈవో గణపతి తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో మండల ప్రత్యేకాధికారి పురుషోత్తంనాయక్‌తో కలిసి పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్, ఐకేపీ సిబ్బందితో వన మహోత్సవంపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1.62లక్షల మొక్కల లక్ష్యాన్ని విజయవంతం చేయాలని సూచించారు. మొక్కలు నాటేందుకు ప్రదేశాలు గుర్తించాలని, మొక్కల సంరక్షణకు వాచర్లను గుర్తించి చేపట్టాల్సిన చర్యలపై అవగాహన కల్పించాలని తెలిపారు. సమావేశంలో ఎంపీడీవో సత్యనారాయణసింగ్, పీఆర్ ఏఈ జగన్, ఏపీఎం వెంకటేశం, ఏపీవో నవీన్, హౌసింగ్ ఏఈ గణేష్, సీనియర్ అసిస్టెంట్ లక్ష్మీనారాయణ, పంచాయతీ కార్యదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

మిల్లుల్లో తనిఖీలు!



సీఎంఆర్ ధాన్యం నిల్వలపై అధికారుల తనిఖీలు(ఫైల్)

- గత ఖరీఫ్ ధాన్యం నిల్వలపై ఆరా
- ఎఫ్‌సీఐ, సివిల్‌సప్లయి అధికారుల పరిశీలనలు
- ఈ నెల 6వరకు నివేదిక ఇవ్వాలని ఆదేశాలు
- క్షుణ్ణంగా పరిశీలిస్తే సన్నాల అక్రమాలు బయటపడే అవకాశం

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: సీఎంఆర్(కస్టమ్ మిల్లింగ్ రైస్) బకాయిలపై ప్రభుత్వం చర్యలకు పూనుకుంటోంది. గతంలో ఆయా సీజన్ల ధాన్యాన్ని పక్కదారి పట్టించి సకాలంలో బియ్యం అందించని రైస్‌మిల్లర్లపై ఆర్ఆర్ చట్టాలు, క్రిమినల్ కేసులు నమోదు చేసిన విషయం తెలిసిందే. తాజాగా 2024–25 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన ధాన్యం నిల్వలు ఉన్నాయా? లేవా? అని ఎఫ్‌సీఐ(ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా), పౌరసరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంటు అధికారులు సంయుక్తంగా తనిఖీ చేయాలంటూ ఆదేశాలు వచ్చాయి. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. ఈ నెల 6లోపే తనిఖీలు చేసి నివేదిక ఇవ్వాలని పేర్కొన్నారు. దీంతో జిల్లాలో గత ఖరీఫ్ సీజన్ మిల్లింగ్ చేయని ధాన్యం కేటాయించిన మేరకు నిల్వలు ఉన్నాయా? లేవా? అని అధికారులు తేల్చనున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అధికారుల సంయుక్త ఆధ్వర్యంలో తనిఖీలు జరగనున్నాయి. జిల్లాలో బుధవారం నుంచి మొదలు కావాల్సి ఉన్నా పరిశీలనకు బృందాలు సిద్ధం కాకపోవడంతో గురువారం నుంచి తనిఖీలు చేపట్టనున్నట్లు సమాచారం. కొంతమంది మిల్లర్లు నాణ్యమైన సన్నబియ్యాన్ని పక్కదారి పట్టించి అమ్ముకున్నారనే ఆరోపణలున్నాయి. ఈ క్రమంలో క్షుణ్ణంగా పరిశీలిస్తే ఆ సీజన్ ధాన్యం అవకతవకలు బయటపడే అవకాశం ఉంది.

పొడగింపు కోసమేనా?

ప్రస్తుతం జిల్లాలో 2023–24 రబీ సీజన్‌కు సంబంధించి మిల్లర్ల నుంచి బకాయిల రికవరీ ఇంకా జరుగుతోంది. 98శాతం పూర్తయింది. ఈ సీజన్‌లో ఇంకా 314ఏసీకే((ఒక ఏసీకే 290 క్వింటాళ్లు)ల బియ్యం బకాయి ఉంది. వీటితోపాటు 2024–25 ఖరీఫ్ సీజన్‌కు 62శాతం బియ్యం అప్పగించారు. మిగతా ధాన్యం మిల్లర్ల వద్ద ఉంది. రోజువారీగా బియ్యం ఇస్తున్నారు. ఇక 2024–25 రబీకి 13శాతం అప్పగించగా, ఈ బియ్యం ఇచ్చేందుకు మిల్లర్లకు గడవు ఉంది. అయితే 2024–25 ఖరీఫ్ పంట ధాన్యం నిల్వలను పరిశీలించాలంటూ ఆదేశాలు వచ్చాయి. ఈ సీజన్ బియ్యం ఇచ్చేందుకు మిల్లర్లకు మరోసారి గడువు పెంచుతారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా ఈ సీజన్‌కు సంబంధించి ధాన్యం అప్పగింతకు గడువు పెంచాలని కోరుతున్నారు. ఈ క్రమంలోనే తనిఖీలు చేసి అంతా సక్రమంగా ఉంటే గడువు పెంచే అవకాశం ఉంది. ఒకవేళ ధాన్యం నిల్వల్లో తేడా గమనిస్తే చర్యలు తీసుకునే అవకాశం ఉంది. ప్రస్తుతం మిల్లర్ల వద్ద గత రెండు సీజన్ల ధాన్యం ఉంది. వీటిలో ఒక ఖరీఫ్ సీజన్ ధాన్యమే పరిశీలించాల్సి ఉంది.

2024-25ఖరీఫ్ సీఎంఆర్ వివరాలు(మెట్రిక్ టన్నుల్లో)

కేటాయించిన ధాన్యం	78,875
అప్పగించిన బియ్యం	53,689
పెండింగ్	20,123
పూర్తయింది	62శాతం

క్రిమినల్ కేసులతో రికవరీ

సకాలంలో బియ్యం అందించని మిల్లర్లపై ఇప్పటికే ఆర్ఆర్(రెవెన్యూ రికవరీ) యాక్టు, క్రిమినల్ కేసులు నమోదు చేశారు. మిల్లులను సీజ్ చేశారు. దీంతో తమ బకాయిలు కట్టేందుకు కిందామీదా పడుతున్నారు. రాజకీయ, ఇతర ఒత్తిళ్లతో కేసుల నుంచి బయటపడాలని ప్రయత్నాలు చేశారు. మళ్లీ ధాన్యం తీసుకునేందుకు ప్రయత్నించారు. అయి తే పౌరసరఫరాల శాఖ అధికారులు కఠినంగా వ్యవహరించడంతో గత యాసంగిలో అనేక మిల్లర్లు ధాన్యం కేటాయింపునకు దూరమయ్యారు. అంతేగాక బ్యాంకు గ్యారంటీలు, జరిమానాలు చెల్లించలేకపోయారు. మరోవైపు కేసుల నుంచి తప్పించుకునేందుకు కోర్టులను ఆశ్రయిస్తున్నారు.

ఇంటర్.. ఇక కొత్తగా

- సర్కారు కళాశాలల దిద్దుబాటు
- ప్రతీ తరగతి గదిలో సీసీ కెమెరా
- కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానం
- బోధన, విద్యార్థుల అభ్యసనపై పర్యవేక్షణ

మంచిర్యాలఅర్బన్: రాష్ట్ర ప్రభుత్వం జూనియర్ కళాశాలల బలోపేతంపై ప్రత్యేక దృష్టి సారించింది. విద్యా నాణ్యత, మౌలిక సౌకర్యాల కల్పన, విద్యార్థుల హాజరు, బోధనా పద్ధతుల పర్యవేక్షణ కోసం సమగ్ర చర్యలు చేపట్టింది. సీసీ కెమెరాల ఏర్పాటు, ఫేషియల్ రికగ్నేషన్ సిస్టమ్ వంటి చర్యలతో సంస్కరణలు ఊపందుకున్నాయి.

సీసీ కెమెరాలతో పర్యవేక్షణ

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో బోధనా పద్ధతులు, లెక్చరర్ల సమయపాలన, విద్యార్థుల హాజరును పర్యవేక్షించేందుకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు. జిల్లాలోని 10 ప్రభుత్వ కళాశాలల్లో ప్రతీ తరగతి గది, ల్యాబ్, ప్రిన్సిపాల్ గదిలో ఒక్కో సీసీ కెమెరా బిగిస్తున్నారు. జిల్లాకు మొత్తం 175కి పైగా కెమెరాలు అందగా, మంచిర్యాల కళాశాలలో 22, లక్సెట్టిపేటలో 15 కెమెరాలు అమర్చనున్నారు. ఈ కెమెరాలను నాంపల్లిలోని ఇంటర్మీడియెట్ బోర్డు కార్యాలయంలో ఉన్న కమాండ్ కంట్రోల్ సెంటర్‌తో అనుసంధానిస్తారు. హైదరాబాద్ నుంచి అధికారులు, నిపుణులు బోధనా తీరును పరిశీలించి, లోపాలను సరిదిద్దేందుకు సలహాలు, సూచనలు అందిస్తారు. లెక్చరర్ల సెలవులు, టైంటేబుల్ అమలు వంటి అంశాలను కూడా ఈ కెమెరాల ద్వారా నిశితంగా పర్యవేక్షిస్తారు.

ఫేషియల్ రికగ్నేషన్...

విద్యార్థుల గైర్హాజరు సమస్యను నియంత్రించేందుకు ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఫేషియల్ రికగ్నేషన్ సిస్టమ్(ఎఫ్ఆర్ఎస్) అమలు చేయనున్నారు. ప్రతీ గ్రూపునకు ఒక లెక్చరర్ వాట్సాప్ గ్రూప్ ఇన్‌చార్జిగా ఉంటారు. విద్యార్థులు తరగతులకు హాజరు కాకపోతే, వారి తల్లిదండ్రులకు సెల్ ఫోన్ ద్వారా సమాచారం ఇస్తారు. వారం రోజులకు మించి గైర్హాజరైతే లెక్చరర్, ప్రిన్సిపాల్‌కు వివరణ ఇవ్వాల్సి ఉంటుంది. ఈ విధానం విద్యార్థులు కళాశాలకు హాజరయ్యేలా చేయడంతోపాటు డుమ్మాలకు చెక్ పెడుతుంది.

మౌలిక సౌకర్యాల కల్పన..

ఏళ్ల తరబడి నిధుల కొరతతో సమస్యలు ఎదుర్కొంటున్న జూనియర్ కళాశాలలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.1.40 కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులతో జిల్లాలోని 10 కళాశాలల్లో దండేపల్లి మినహా తొమ్మిది కళాశాలల్లో విద్యుత్, తాగునీరు, చిన్న చిన్న మరమ్మతులు చేపట్టి సౌకర్యాలు కల్పిస్తారు. కళాశాలల్లో విద్యార్థుల ఇబ్బందులు తొలగిస్తారు.

పెరుగుతున్న ప్రవేశాలు..

జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థుల ప్రవేశాలు క్రమంగా పెరుగుతున్నాయి. ఉచిత పాఠ్యపుస్తకాలు, నాణ్యమైన బోధన, మెరుగైన సౌకర్యాలు, విస్తృత ప్రచారం వంటి కారణాలతో విద్యార్థులు ప్రభుత్వ కళాశాలల వైపు మొగ్గుతున్నారు. జిల్లాలో జనరల్, వొకేషనల్ కలిపి 1,461 మంది విద్యార్థులు ప్రవేశాలు పొందారు. లక్సెట్టిపేటలోని ఆధునిక కళాశాలలో అత్యధికంగా 290 మంది, మంచిర్యాలలో 275 మంది చేరగా, సౌకర్యాలు తక్కువగా ఉన్న దండేపల్లిలో 49 మంది ప్రవేశించారు.



లక్సెట్టిపేట ప్రభుత్వ కాలేజీలో సీసీ కెమెరాలు

సంస్కరణలతోపాటు సౌకర్యాలు..

ప్రభుత్వం చేపట్టిన వివిధ సంస్కరణలతో కళాశాలల్లో విద్యాబోధన మెరుగుపడుతుంది. సౌకర్యాలు సమకూరుతాయి. నిధుల మంజూరుతో సమస్యలు దూరం కానున్నాయి. ప్రతీ తరగతి గదిలో సీసీ కెమెరా ఏర్పాటుతో బోధనలో పారదర్శకత పెరుగుతుంది.

– అంజయ్య, డీఐఈవో, మంచిర్యాల

కళాశాల వారీగా మంజూరైన నిధులు..

కళాశాల పేరు	నిధులు(రూ.లక్షల్లో)
మంచిర్యాల	16.05
మందమర్రి	16.65
కాసిపేట	16.22
చెన్నూరు	21.9
బెల్లంపల్లి బాలికల	16.65
బెల్లంపల్లి	5.6
జైపూర్	20.81
జన్నారం	16.22
లక్సెట్టిపేట	10.85

మూత 'బడి'ని తెరిపించారు



పాఠశాల ప్రారంభోత్సవంలో ఎంఈవో, ఎస్సై



పాఠశాలను ప్రారంభిస్తున్న డీఈఓ యాదయ్య

దండేపల్లి: మండలంలోని కొత్తమామిడిపల్లిలో గత 15ఏళ్ల క్రితం విద్యార్థులు లేని కారణంగా మూతపడిన ప్రాథమిక పాఠశాలను బుధవారం తెరిపించారు. గ్రామంలో బడిని తెరిపించి పిల్లలను బడికి పంపించాలని గ్రామస్తులు నిర్ణయించారు. ఇటీవల ఎంఈవో చిన్నయ్యను కలిసి వినతిపత్రం అందజేశారు. దీంతో బుధవారం 20 మంది విద్యార్థులతో పాఠశాలను పునఃప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై తహసీనొద్దీన్, కాంప్లెక్స్ హెచ్ఎం శ్రీనివాస్, ఎంఐఎస్ నగేష్, సీఆర్పీ నర్సయ్య, మాజీ సర్పంచ్‌లు గడ్డం రాజయ్య, త్రిమూర్తి, మాజీ జెడ్పీటీసీ నాగరాణి, పెరిక సంఘం మండల అధ్యక్షుడు గడ్డం రాంచందర్, వీపీ గడ్డం కీర్తన, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వేంపల్లిలో..

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధి వేంపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను డీఈఓ యాదయ్య బుధవారం ప్రారంభించారు. పదేళ్ల క్రితం మూతపడిన పాఠశాలలో తాజాగా ఏడుగురు విద్యార్థులు చేరారని, మరికొందరు చేరేందుకు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సెక్టోరియల్ అధికారులు చౌదరి, సత్యనారాయణమూర్తి, ఎంఈఓ తిరుపతిరెడ్డి, మండల నోడల్ అధికారి హన్మాండ్లు, ప్రధానోపాధ్యాయుడు సుధారాణి, ఉపాధ్యాయురాలు రేవతి పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రతిభకు డీఈఓ చప్పట్లు

నంనూర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల ప్రతిభను అభినందిస్తూ డీఈఓ యాదయ్య చప్పట్లు కొట్టారు. బుధవారం పాఠశాలను తనిఖీ చేసిన ఆయన 1వ, 7వ తరగతి గదుల్లో విద్యార్థుల ప్రతిభా పాటవాలను పర్యవేక్షించారు. తెలుగు, ఇంగ్లిష్ పాఠ్యపుస్తకాల్లోని పదాలు, పాఠ్యాంశాలను చదివించి బోర్డుపై పదాలు చెబుతూ రాయించారు. పదాలు స్పష్టంగా రాయడంతో అభినందించారు. విద్యార్థుల ప్రవేశాలను 100వరకు పెంచినందుకు ప్రధానోపాధ్యాయుడు గురవయ్య, ఉపాధ్యాయులను ప్రత్యేకంగా ప్రశంసించారు. సెక్టోరియల్ అధికారి చౌదరి, ఉపాధ్యాయులు సత్యనారాయణచారి, ప్రశాంత్ పాల్గొన్నారు.

నిర్లక్ష్యం.. ప్రాణాంతకం!



జిల్లా కేంద్రంలోని ఐబీలో వన్‌వే ఏర్పాటు చేసిన ట్రాఫిక్ పోలీసులు

- రోడ్డు ప్రమాదాలతో రక్తసిక్తం
- నివారణపై పోలీసుల ప్రత్యేక దృష్టి
- జిల్లాలో 30 బ్లాక్‌స్పాట్లు గుర్తింపు

మంచిర్యాలక్రైం: నిర్లక్ష్యపు డ్రైవింగ్ ఇటు వాహన చోదకులకు అటు ఇతరులకు ప్రాణాంతకంగా మారుతోంది. ఇటీవల జరుగుతున్న ప్రమాదాలతో చిన్న వాహనదారులు, ప్రజలు రోడ్డెక్కాలంటేనే భయపడాల్సి వస్తోంది. యేటా ప్రమాదాల్లో పలువురు మృతిచెందుతుండగా.. వందల సంఖ్యలో క్షతగాత్రులు అవుతున్నారు. జిల్లాలో తరచూ ప్రమాదాలు జరిగే 30 ప్రాంతాలను బ్లాక్‌స్పాట్లుగా గుర్తించిన పోలీసులు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. వాహనదారులు సైతం నిర్లక్ష్యపు డ్రైవింగ్ వీడాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కొరడా ఝళిపిస్తున్నారు. రోడ్డు ప్రమాదాలు జరగడానికి పలు కారణాలను గుర్తించారు.

కారణాలివే..

- కొత్త కొత్త ఫీచర్లు, హైస్పీడ్‌తో వాహనాలు వస్తున్నాయి. వాహనాల సాంకేతిక పరిజ్ఞానంపై చోదకులకు అవగాహన లేక నడపడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయి.
- రోడ్లపై ఇష్టానుసారంగా గుంతలు తవ్వి వదిలేయడం, వాహనదారుల తొందరపాటు, గమ్యస్థానానికి త్వరగా చేరుకోవాలనే ఆత్రుత, మితిమీరిన వేగం, నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేయడం.
- రహదారుల విస్తరణ, మరమ్మతుల సమయంలో కాంట్రాక్టర్లు సరైన రక్షణ చర్యలు చేపట్టకపోవడం.
- గ్రామాల నుంచి హైవే రహదారులకు అనుసంధానం అయ్యే లింకు రోడ్ల వద్ద సరైన అవగాహన, ట్రాఫిక్ నిబంధనలు లేకుండా, ప్రమాద సూచిక బోర్డులు లేకపోవడం.
- వాహనదారులు మద్యంమత్తు, భారీ వాహనాలు నడిపే డ్రైవర్లు విశ్రాంతి తీసుకోకపోవడం, ఒత్తిడిలోనే డ్రైవింగ్ చేయడం.
- మైనర్ డ్రైవింగ్, ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవడం.

నివారణ చర్యలు

జిల్లాలోని జాతీయ, రాష్ట్ర రహదారుల అధికారుల సమన్వయంతో రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. రాత్రివేళల్లో రోడ్ల వెంట రిఫ్లెక్టింగ్ లైట్లు, అవసరమైన చోట స్పీడ్‌బ్రేకర్లు, కాలినడకన రోడ్డు దాటే చోట జీబ్రా లైన్లు ఏర్పాటు చేస్తున్నారు. నేషనల్ హైవే అధికారులతో చర్చించి ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల్లో భాగంగా సుమారు రూ.60లక్షల విలువైన సామగ్రి అవసరమని పోలీసులు నివేదిక పంపించారు. రూ.40లక్షలు మంజూరు కాగా సూచిక బోర్డులు, జీబ్రాలైన్లు, చిన్న స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయనున్నారు. జిల్లా కేంద్రం మంచిర్యాల ఐబీ చౌరస్తాలో తరచూ ప్రమాదాలు జరుగుతుండేవి. వాటి నివారణకు ఇరువైపు ప్లాస్టిక్ స్టిక్స్ రోప్‌తో లైనింగ్ ఏర్పాటు చేశారు. ట్రాఫిక్ పోలీసులను అప్రమత్తంగా ఉంచుతున్నారు.

జిల్లాలో గుర్తించిన బ్లాక్‌స్పాట్లు

నేషనల్ హైవే–63

మంచిర్యాల: మేదరివాడ, లక్ష్మిటాకీస్, ఓవర్ బ్రిడ్జి, నస్పూర్ తోళ్లవాగు, అంబేడ్కర్ కాలనీ, తెలంగాణతల్లి చౌక్, సీసీ ఎక్స్‌రోడ్, శ్రీరాంపూర్ పెట్రోల్‌బంక్, శ్రీరాంపూర్ సోనియానగర్, ఎస్ఆర్‌పీ–3 మెయిన్‌రోడ్, శ్రీరాంపూర్ బస్టాండ్, జీఎం ఆఫీస్

హాజీపూర్: గుడిపేట బెటాలియన్ పెట్రోల్‌బంక్, ముల్కల్ల బస్‌స్టాప్, బ్రిడ్జి, వేంపల్లి మేకల మండి, జీపీ ఆఫీస్,

లక్సెట్టిపేట: ఆంధ్రబోర్, కరీంనగర్ చౌరస్తా, గుల్లకోట, రాయపట్నం బ్రిడ్జి

నేషనల్ హైవే–363

రామకృష్ణాపూర్: గద్దరాగడి, బొక్కలగుట్ట, పులిమడుగు, మందమర్రి ఈసర్ పెట్రోల్‌బంక్, ఎస్ఎండీసీ కాలేజీ అందుగులపేట, యాపల్ ఏరియా, కాసిపేట జంక్షన్ సోమగూడెం చౌరస్తా, బెల్లంపల్లి గంగారాంనగర్,

స్టేట్ హైవే–1

జైపూర్: అటవీశాఖ చెక్‌పోస్ట్ ఇందారం, ఇందారం ఎక్స్‌రోడ్

స్టేట్ హైవే–24

జన్నారం: పొనకల్ బస్టాండ్, పైడిపల్లి డీర్ పార్క్, దండేపల్లి మండలం ముత్యంపేట అటవీశాఖ చెక్‌పోస్ట్ నుంచి నెల్కి వెంకటపూర్ వరకు

జిల్లాలో బ్లాక్‌స్పాట్ ప్రాంతాల్లో ప్రమాదాలు

సంవత్సరం	ప్రమాదాలు	మృతులు
2022	144	66
2023	95	36
2024	81	48
2025	185	65

ప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టి



రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టి సారించి కార్యాచరణ మొదలుపెట్టాం. జిల్లాలో తరచూ ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించాం. అక్కడ ప్రమాదాలు జరగకుండా జాతీయ, రాష్ట్ర రహదారులు, పోలీసు అధికారుల కమిటీ సమన్వయంతో జాగ్రత్తలు తీసుకుంటున్నాం. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తప్పవు. – సత్యనారాయణ, ట్రాఫిక్ సీఐ, మంచిర్యాల

జిల్లాలో యూరియా కొరత లేదు



రిజిష్టర్లు తనిఖీ చేస్తున్న డీఏవో కల్పన

సాక్షి ఎఫెక్ట్..

నెన్నెల: జిల్లాలో యూరియా కొరత లేదని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా వ్యవసాయ అధికారి కల్పన అన్నారు. 'యూరియా కోసం రైతుల కొట్లాట' శీర్షికన 'సాక్షి'లో ప్రచురితమైన వార్తకు స్పందించారు. బుధవారం మండల కేంద్రంలోని మహిళా ఉత్పత్తిదారుల సంస్థ(డబ్ల్యూఎఫ్‌పీసీ)తోపాటు ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. యూరియా నిల్వలు, రిజిష్టర్లు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతుల గొడవ యూరియా కోసం కాదని, వ్యక్తిగత కారణాలతో గొడవపడినట్లు తన దృష్టికి వచ్చిందని అన్నారు. మండలానికి 342మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేశామని, డీలర్లు దుకాణాలు రోజూ తెరిచి ఉంచాలని తెలిపారు. కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఈ–పాస్ యంత్రాల పంపిణీ

నెన్నెల రైతు వేదికలో భీమిని, నెన్నెల, కన్నెపల్లి, వేమనపల్లి మండలాల ఎరువుల డీలర్లకు ఈ–పాస్ యంత్రాలను జిల్లా వ్యవసాయ అధికారి కల్పన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ–పాస్ యంత్రాల ద్వారానే ఎరువులు విక్రయించాలని, అమ్మకాలు, నిల్వల్లో పారదర్శకత పాటించాలని సూచించారు. ఈ–పాస్ యంత్రంలో వివరాలు నమోదు చేస్తే ఎంత ఎరువులు ఎవరి పేరు మీద అమ్మారనేది తెలుస్తుందని అన్నారు. ఈ విధానం ద్వారా ప్రతీ గ్రామం, మండలం, జిల్లా వారీగా పంటల సాగు విస్తీర్ణం అంచనాల ప్రకారం ఎరువుల వినియోగాన్ని పర్యవేక్షించడం సాధ్యమవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో భీమిని ఏడీఏ సురేఖ, ఏఓ సృజన, ఏఈఓ రాంచందర్ పాల్గొన్నారు.

అలరించిన పోలీస్ డ్యూటీ మీట్



డాగ్‌ను పరిశీలిస్తున్న సీపీ అంబర్ కిషోర్ ఝా

మంచిర్యాలక్రైం: కాళేశ్వరం జోన్‌స్థాయి తెలంగాణ స్టేట్ పోలీస్ డ్యూటీ మీట్ బుధవారం రామగుండం పోలీస్ కమిషనరేట్‌లో ప్రారంభమైంది. నైపుణ్యం, సామర్థ్యం, ప్రతిభ గుర్తించడానికి పోలీస్ డ్యూటీ మీట్ ఏర్పాటు చేశారు. రామగుండం సీపీ అంబర్ కిశోర్ ఝా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కాళేశ్వరంజోన్‌లోని రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధి పెద్దపల్లి, మంచిర్యాల జోన్, కుమురంభీమ్ ఆసిఫాబాద్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లా పరిధిలోని పోలీస్ అధికారులు, సిబ్బందికి పలు పోటీలు నిర్వహించారు. గురువారం కూడా పోటీలు జరుగుతాయి. కార్యక్రమంలో అదనపు డీసీపీ(అడ్మిన్) రాజు, స్పెషల్ బ్రాంచ్, గోదావరిఖని, ట్రాఫిక్, ఏఆర్ ఏసీపీలు మల్లారెడ్డి, రమేశ్, శ్రీనివాస్ ప్రతాప్, సీఐలు బాబురావు, సతీశ్, చంద్రశేఖర్‌గౌడ్, ఆర్ఐలు దామోదర్, వామనమూర్తి, మల్లేశం, శ్రీనివాస్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

'వ్యాసపౌర్ణమి'కి రావాలని మంత్రికి ఆహ్వానం



మంత్రికి ఆహ్వానపత్రిక అందజేస్తున్న ఈవో

బాసర: బాసరలోని జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయంలో ఈ నెల 8, 9, 10 తేదీల్లో నిర్వహించనున్న వ్యాసపౌర్ణమి (గురుపౌర్ణమి) ఉత్సవాలకు రావాలని దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యే రామారావు పటేల్‌ను కలిసి ఆహ్వానపత్రిక అందజేశారు. ఆలయ ఈవో సుధాకర్‌రెడ్డి, ప్రధాన అర్చకులు సంజీవ్, వేదపండితులు నవీన్ శర్మ హైదరాబాద్‌లో వారిని కలిసారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు.

డయల్100కు రాంగ్‌కాల్ చేసిన వ్యక్తి బైండోవర్

తాండూర్: ప్రజలకు అత్యవసర సేవలు అందించేందుకు ఏర్పాటు చేసిన డయల్ 100కు రాంగ్‌కాల్ చేసిన ఒకరిని బైండోవర్ చేసినట్లు ఎస్సై కిరణ్ కుమార్ తెలిపారు. మండలంలోని అచ్చలాపూర్ గ్రామానికి చెందిన సైదం మదునయ్య నిత్యం మద్యం మత్తులో డయల్ 100కు కాల్‌చేసి సిబ్బందిని ఇబ్బందులకు గురిచేస్తున్నాడు. పలుమార్లు అతనిని పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చారు. అయినా అతని ప్రవర్తనలో మార్పు రాకపోవడంతో బుధవారం తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్సై తెలిపారు.

జేబుదొంగ రిమాండ్

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని తాటిగూడకు చెందిన షేక్ హమీద్ బుధవారం వెంకటేశ్వర బార్ సమీపంలో ఓ వ్యక్తి జేబు కత్తిరించి రూ.500 నగదు దొంగిలించాడు. దీంతో రాంనగర్ కాలనీకి చెందిన బాధితుడు గడ్డం వంశీరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు టూటౌన్‌లో సీఐ కరుణాకర్‌రావు తెలిపారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించారు.

పేకాట ఆడుతున్న పదిమంది..

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని బంగల్‌పేట్ మహాలక్ష్మివాడ లోని ఓ ఇంట్లో బుధవారం పేకాట ఆడుతున్న పదిమందిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పట్టణ సీఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు. ఓ మాజీ ప్రజాప్రతినిధి ఓ ఇంట్లో పేకాట నిర్వహిస్తూ తనుకూడా ఆడుతుండగా తమకు అందిన పక్కా సమాచారం మేరకు పోలీసులు ఆ ఇంటిపై దాడి చేశారు. పదిమందిని అదుపులోకి తీసుకుని మూడు కార్లు, 3 బైకులు, పది సెల్‌ఫోన్లు, సుమారు రూ.98 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. ఇందులో మరో మాజీ ప్రజా ప్రతినిధి కూడా ఉన్నారని స్థానికులు తెలిపారు.

ఒకరిపై అడవిపంది దాడి

లక్సెట్టిపేట: మండలంలోని ఎల్లారంలో బుధవారం మల్యాల లింగయ్యపై అడవిపంది దాడి చేయడంతో తీవ్రగాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు వెంటనే కరీంనగర్‌లోని ఆసుపత్రికి తరలించారు. అటవీశాఖ అధికారులు ఆదుకోవాలని బాధిత కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

పంట రుణాలకు ప్రదక్షిణలు

- పట్టాలు ఉన్నా కనికరించని బ్యాంకర్లు
- నిబంధనల పేరుతో తిరస్కరిస్తున్న వైనం
- మూడేళ్లుగా తిరుగుతున్న పోడు రైతులు
- ప్రజావాణిలో కలెక్టర్‌కు అన్నదాతల ఫిర్యాదు



కలెక్టర్‌కు ఫిర్యాదు చేసేందుకు వచ్చిన కన్నెపెల్లి మండల రైతులు (ఫైల్)

మంచిర్యాలఅగ్రికల్చర్: అటవీ ప్రాంతంలో నివాసం ఉంటున్న గిరిజన రైతులు పాతికేళ్లుగా సాగు చేసుకుంటున్న భూములకు హక్కుపత్రాల కోసం అధికారుల చుట్టూ తిరిగారు. ప్రస్తుతం పట్టా పాసు పుస్తకాలున్నా పంట రుణం కోసం మూడేళ్లుగా బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారు. రైతుబంధు, రైతు భరోసా సైతం అందుతున్నా బ్యాంకర్లు పంటరుణాలు మాత్రం ఇవ్వడం లేదని వాపోతున్నారు. పంట రుణాలు అందించడంలో ఒక్కో ప్రాంతంలో ఒక్కోతీరుగా నిబంధనలు అమలు చేస్తున్నారని బ్యాంకర్ల తీరుపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బ్యాంకుల చుట్టూ తిరిగి వేసారి ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్నారు. పట్టా పాసు పుస్తకాలున్నా.. పంటలు సాగు చేస్తున్నా.. మాకెందుకు రుణాలు ఇవ్వడంలేదని గోడు వెళ్లబోసుకుంటున్నారు. గతేడాది వానాకాలం తాండూర్ మండలం పెగడపల్లికి చెందిన పోడురైతులు కలెక్టర్‌ను కలిసి విన్నవించారు. అయినా ఫలితం లేకపోవడంతో బ్యాంకు వద్ద ఆందోళన చేపట్టారు. తహసీల్దార్ కార్యాలయం నుంచి ధ్రువీకరణపత్రం తీసుకొస్తే రుణం మంజూరు చేశారు. అది కూడా ఎకరాలతో సంబంధం లేకుండా ఒక్కో రైతుకు రూ.20 వేల నుంచి రూ.30 వేల చొప్పున అందజేశారు.

రైతుభరోసా వచ్చినా..

ఏళ్ల తరబడిగా అటవీ భూములను సాగు చేసుకుంటున్న గిరిజన, ఆదివాసీ రైతులకు 2006లో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో పట్టా పాస్‌పుస్తకాలు అందజేశారు. అప్పటి నుంచి పంట రుణాలు తీసుకోవడంతో పాటు రుణమాఫీ సైతం వర్తించింది. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం 2023లో 13 మండలాల్లోని 3821.24 ఎకరాలకుగానూ 1847 మంది రైతులకు పట్టా పాసుపుస్తకాలు అందజేసింది. రైతుబంధు నగదు సైతం ఖాతాలో జమచేసింది. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న రైతుభరోసా ఎకరానికి రూ.6 వేల నగదు అందుకుంటున్నారు. కానీ పహాణీ, వన్‌బి ఇస్తేనే రుణాలు ఇస్తామని బ్యాంకర్లు నిబంధనలు విధిస్తున్నారు. కానీ ఈ పోడు భూములకు ప్రస్తుతం రెవెన్యూ రికార్డుల నుంచి పహాణీ, వన్‌బి రావడం లేదు. దీంతో రుణాలు ఇవ్వడంలేదని రైతులు ఆవేదన చెందుతున్నారు.

అప్పుడట్ల.. ఇప్పుడిట్ల



ఏళ్ల తరబడి సాగు చేసుకుంటున్న పోడు భూములకు పట్టాలివ్వాలని ఆఫీసుల చుట్టూ తిరిగితే రెండేళ్ల క్రితం నాకు 3.11 ఎకరాలకు పట్టా పాసు బుక్ ఇచ్చిండ్రు. పంటరుణం కోసం బ్యాంకులకు వెళ్తే ఈ బుక్కుల మీద లోన్లు ఇవ్వమని చెప్పుండ్రు. కొన్ని ఊళ్లలో ఇస్తున్నా మాకెందుకు ఇస్తలేరు. మాకు కూడా లోన్లు ఇవ్వాలి.

– జంబి పద్మ, వీరపూర్, కన్నెపెల్లి

అప్పుచేసి సాగుచేసిన



నాకు రెండెకరాల నాలుగు గుంటలకు పట్టా పాసుపుస్తకం ఉన్నా బ్యాంకులో రుణం ఇస్తలేరు. ఎన్నిసార్లు తిరిగినా మీకురావని చెబుతుండ్రు. అప్పులు చేసి పంటలు సాగు చేసుకుంటున్నాం. బ్యాంకలో లోన్ తీసుకుంటే వడ్డీ మాఫీ అయితదని అనుకుంటే రుణం ఇవ్వడంలేదు.

– మానేపల్లి బానయ్య, రెబ్బెన, కన్నెపెల్లి

ఊరికో తీరుగా..



మాపక్కన ఉన్న నెన్నెల మండలంలో పోడు భూములకు పట్టాపాసు పుస్తకం ఉన్న రైతులకు పంటరుణాలు ఇస్తుండ్రు. మా మండలంలో మాత్రం ఇస్తలేరు.. ఇదేందంటే ఆ కాగితం ..ఈ కాగితం ఉంటే ఇస్తామంటుండ్రు. రూల్స్ అంతటా ఒక్కతీరు ఉండవా.

– జంబి భాగ్యలక్ష్మి, వీరపూర్, కన్నెపెల్లి

జీవితంపై విరక్తితో ఒకరు ఆత్మహత్య

కుంటాల: జీవితంపై విరక్తితో ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై అశోక్ తెలిపిన వివరాల మేరకు మండలంలోని విఠాపూర్ గ్రామానికి చెందిన చిట్యాల సురేష్ (40) భార్య పదేళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందింది. అప్పటి నుంచి మనస్తాపానికి గురయ్యాడు. మంగళవారం రాత్రి కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేసి పడుకున్నాడు. జీవితంపై విరక్తితో బుధవారం ఉదయం గ్రామ శివారులోని చెట్టుకు ఉరేసుకున్నాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. మృతునికి కుమారుడు, కూతురు ఉన్నారు. మృతుని తండ్రి ముత్తన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

హత్య కేసులో నిందితుల అరెస్టు

కాగజ్‌నగర్‌రూరల్: పెంచికల్‌పేట్ మండలంలోని కొండపల్లికి చెందిన ఢీకొండ శ్రీధర్‌ను హత్య చేసిన ఘటనలో అదే గ్రామానికి చెందిన ముగ్గురిని అరెస్టు చేసినట్లు కాగజ్‌నగర్ రూరల్ సీఐ శ్రీనివాస్‌రావు తెలిపారు. బుధవారం రూరల్ సర్కిల్ కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. శ్రీధర్ గ్రామానికి చెందిన మహిళతో వివాహేతర సంబంధం కలిగి ఉన్నాడు. అయితే అక్రమ సంబంధాన్ని కొనసాగించాలని సదరు మహిళను తరచూ వేధిస్తుండేవాడన్నారు. లేదంటే అందరికీ చెప్పి పరువు తీస్తానని బెదిరించే వాడన్నారు. విసుగు చెందిన రాజన్న, అతని సోదరుడు లచ్చన్న, సదరు మహిళతో కలిసి పథకం ప్రకారం శ్రీధర్‌ను రహస్య ప్రదేశానికి పిలిచి గొడ్డళ్లు, కత్తితో దాడి చేసి హత్య చేశారన్నారు. సమావేశంలో కాగజ్‌నగర్ రూరల్ ఎస్సై సందీప్ కుమార్, పెంచికల్‌పేట్ ఎస్సై పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



నవీన్ (ఫైల్)

నెన్నెల: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతిచెందినట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు. సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలాఉన్నాయి. మహారాష్ట్రలోని సిరోంచ తాలూకా పెంటుపాకకు చెందిన బోగె నవీన్ (23) బుధవారం నెన్నెలలో ఉన్న అత్తగారింటికి వచ్చాడు. మధ్యాహ్నం బైక్‌పై స్వగ్రామానికి వెళ్తుండగా జోగాపూర్ వద్ద బైక్ అదుపుతప్పి కిందపడ్డాడు. తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య మాధురి, కుమార్తె ప్రియాన్షిక (10 నెలలు) ఉన్నారు. మాధురి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు

ఒకరికి తీవ్రగాయాలు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మంచిర్యాల నుంచి లక్సెట్టిపేట వైపు వెళ్తున్న ఇన్నోవా కారు బుధవారం రాపల్లి శివారులో అదుపుతప్పి ఓ చెట్టును వేగంగా ఢీ కొట్టింది. కారులో ప్రయాణిస్తున్న హాజీపూర్ మండలానికి చెందిన పోరెడ్డి ప్రవీణ్, చింతకింది హరీశ్‌కు స్వల్పంగా మల్యాల కిరణ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను మంచిర్యాలలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నారు.

తాండూర్ సీఐ కుమారస్వామి బదిలీ



బదిలీ అయిన సీఐ కుమారస్వామి

తాండూర్: తాండూర్ సీఐ కే.కుమారస్వామిని ఖమ్మం జిల్లా మధిర సర్కిల్‌కు బదిలీ చేస్తూ మల్టీజోన్-1 ఐజీపీ చంద్రశేఖర్‌రెడ్డి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. దాదాపు ఏడాదిన్నర కాలం ఇక్కడ పని చేసిన ఆయన గంజాయి నిర్మూలనపై ప్రత్యేక దృష్టి సారించారు. నకిలీ విత్తనాల నిర్మూలనపై రైతులకు అవగాహన కల్పించారు. యువత చెడు వ్యసనాలకు లోనుకాకుండా కబడ్డీ, వాలీబాల్, క్రికెట్ పోటీలు నిర్వహించారు.

చెన్నూర్ రూరల్ సీఐగా బన్సిలాల్

చెన్నూర్ రూరల్ సీఐగా ఆర్.బన్సిలాల్‌ను నియామకం అయ్యారు. వెయిటింగ్‌లో ఉన్న ఆయనకు పోస్టింగ్ కల్పిస్తూ ఐజీపీ ఉత్తర్వులు జారీ చేశారు.

హోటల్ యజమానులపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: మైనర్‌లను పనిలో పెట్టుకున్న ఆదిలాబాద్ పట్టణంలోని గణేశ్ హోటల్ యజమాని కేశవ్, జైఅంబే హోటల్ యజమాని రాజేష్ శర్మపై కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపారు. గణేశ్ హోటల్‌లో మహారాష్ట్రకు చెందిన 17 ఏళ్ల బాలుడు సోహిల్ సోంట్‌వాల్, జైఅంబే హోటల్‌లో మహారాష్ట్రకు చెందిన 17 ఏళ్ల బాలుడు సుజిల్ రాంకిషన్‌ను పనిలో పెట్టుకున్నట్లు తెలిపారు. కార్మిక శాఖ జూనియర్ అసిస్టెంట్ సందీప్ రెడ్డి ఫిర్యాదు మేరకు రెండు హోటళ్ల యజమానులపై బుధవారం కేసు నమోదు చేసినట్లు వివరించారు.

మద్యం విక్రేతపై..

ఆదిలాబాద్‌టౌన్: అధిక ధరకు మద్యం విక్రయిస్తున్న ఆదిలాబాద్ పట్టణంలోని తిర్పెల్లికి చెందిన కరోర శుభంపై కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపారు. వైన్స్ షాపుల నుంచి తక్కువ ధరకు మద్యం కొనుగోలు చేసి తన ఇంట్లో నిల్వ ఉంచి అధిక ధరకు విక్రయిస్తున్నాడన్నారు. బుధవారం మద్యం సీసాలను కొనుగోలు చేస్తున్న సమయంలో వన్‌టౌన్ పోలీసులు పట్టుకుని డౌన్‌టౌన్ విస్కీ 29 బాటిళ్లు, ఒరిజినల్ చాయిస్ 20 బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వాటి విలువ రూ.5,990 ఉంటుందన్నారు. నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయిస్తుండడంతో కేసు నమోదు చేసినట్లు వివరించారు.

విద్యుదాఘాతంతో మూగజీవాలు మృతి

తానూరు: మండలంలోని ఝరి(బి)లో విద్యుదాఘాతంతో రెండు మూగజీవాలు మృతి చెందాయి. గ్రామానికి చెందిన రైతు గుర్ల శ్రీనివాస్ మంగళవారం రాత్రి వర్షం కురుస్తోందని తన ఎద్దు, ఆవును రేకులషెడ్డులో కట్టేశాడు. స్తంభం నుంచి షెడ్డులోకి సరఫరా అవుతున్న విద్యుత్ తీగలు రేకులు కోసుకుని తెగిపోవడంతో విద్యుత్ సరఫరా జరిగింది. షెడ్డులో కట్టేసిన ఆవు, ఎద్దు షాక్‌కు గురికావడంతో అక్కడికక్కడే మృతి చెందాయి. వాటి విలువ రూ.లక్ష వరకు ఉంటాయని బాధిత రైతు వాపోయాడు.

గ్లోబల్ లెర్నింగ్‌లో ఆర్జీయూకేటీ ముందడుగు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ప్రొఫెసర్ గోవర్ధన్

బాసర: బాసర ఆర్జీయూకేటీ గ్లోబల్ లెర్నింగ్‌లో మరో ముందడుగు వేసిందని వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్ అన్నారు. బుధవారం ఓఎస్‌డీ మురళీదర్శన్‌తో కలిసి గ్లోబల్ లెర్నింగ్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2025–2026 విద్యాసంవత్సరానికి అమెరికాలోని ప్రఖ్యాత వార్టన్ బిజినెస్ స్కూల్, యూనివర్సిటీ ఆఫ్ పెన్సిల్వేనియా ద్వారా ఆఫర్ చేస్తున్న రెండు అంతర్జాతీయ ప్రోగ్రామ్‌లకు సంబంధించి రూ.40 లక్షల విలువైన 453 ఉచిత కోర్సెరా లైసెన్స్‌లు విద్యార్థులకు అందించామన్నారు. ఈ కోర్సుల ద్వారా విద్యార్థులు లీడర్‌షిప్, ఇన్నోవేషన్, మషీన్ లెర్నింగ్ వంటి అత్యవసర నైపుణ్యాలలో అంతర్జాతీయ సర్టిఫికేషన్‌తో కూడిన అనుభవాన్ని పొందనున్నారన్నారు. ఈ ప్రోగ్రామ్‌లు నేటి నుంచి ఈనెల 14 వరకు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ సుజయ్ సర్కార్, కోర్సు ఇన్‌స్ట్రక్టర్లు స్వాతి, స్వప్నిల్, ఐఐఈడీ కోఆర్డినేటర్ రాకేష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విద్యాప్రమాణాల మెరుగుకు ప్రత్యేక ప్రణాళిక

- ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా



మాట్లాడుతున్న పీవో ఖుష్బూ గుప్తా

ఉట్నూర్‌రూరల్: గిరిజన విద్యా ప్రమాణాల మెరుగు పరచడానికి ఐటీడీఏ ఎడ్యుకేషన్ విజయ్–2035 ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేశామని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బూ గుప్తా అన్నారు. బుధవారం పీఎంఆర్‌సీ ఉట్నూర్ సమావేశ మందిరంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా ఆశ్రమ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, వసతి గృహ సంక్షేమ శాఖ అధికారుల సమావేశానికి హాజరై మాట్లాడారు. రాబోయే పదేళ్లలో డ్రాపౌట్లు లేకుండా వందశాతం విద్యార్థుల నమోదుతో నాణ్యమైన విద్యను అందించేలా చర్యలు తీసుకుంటామన్నారు. పది రోజుల్లో ఆశ్రమ పాఠశాలలకు 80 శాతం విద్యార్థులు హాజరయ్యేలా చూడాలన్నారు. అనంతరం ఐటీడీఏ ఎడ్యుకేషన్ విజన్ 2035 లోగో ప్రతులను ఆవిష్కరించారు. గతేడాది పదో తరగతిలో వందశాతం ఫలితాలు సాధించిన ఆశ్రమ పాఠశాలల ప్రధానోపాధ్యాయులను సన్మానించారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీడీలు జాదవ్ అంబాజీ, రమాదేవి, డీటీడీవో జనార్దన్, ఏసీఎంవోలు జగన్, ఉద్దవ్, శివాజీ, జీజీడీవోలు చాయ, శంకుంతల, జిల్లా క్రీడా అధికారి పార్థసారథి పాల్గొన్నారు.

ఇన్వెస్టిగేషన్ టూల్‌గా సైన్స్

- నిజామాబాద్ సీపీ సాయిచైతన్య
- కమిషనరేట్‌లో బాసర జోన్ – 2 పోలీస్ డ్యూటీ మీట్
- హాజరైన నిజామాబాద్, జగిత్యాల, నిర్మల్, ఆదిలాబాద్ పోలీసులు



మాట్లాడుతున్న సీపీ సాయి చైతన్య

ఖలీల్‌వాడి: మారుతున్న కాలానికి అనుగుణంగా చట్టాలను, సైన్స్‌ను ఇన్వెస్టిగేషన్ టూల్‌గా మార్చుకోవాలని పోలీస్ కమిషనర్ సాయిచైతన్య సిబ్బందికి సూచించారు. జోన్ – 2 బాసర లెవల్ పోలీస్ డ్యూటీమీట్ – 2025ను నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్‌లో సీపీ బుధవారం ప్రారంభించారు. విధి నిర్వహణ సామర్థ్యం పెంచే ఉద్దేశంతో నిర్వహిస్తున్న మీట్‌లో మూడు రోజులపాటు డిపార్ట్‌మెంటల్ పోటీలు కొనసాగనుండగా, నిజామాబాద్, జగిత్యాల, నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాలకు చెందిన పోలీసు సిబ్బంది పాల్గొంటున్నారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ పోటీల ద్వారా పోలీస్ విభాగంలో కానిస్టేబుల్ స్థాయి నుంచి సీఐ స్థాయి వరకు పని పద్ధతులు మెరుగుపడి ఇన్వెస్టిగేషన్ స్థాయి పెరుగుతుందని, పనిలో పోటీతత్వం అలవడుతుందన్నారు. సైంటిఫిక్ ఇన్వెస్టిగేషన్, ఫొరెన్సిక్, ఫింగర్ ప్రింట్ ఇన్వెస్టిగేషన్ ఎంపికల్లో భాగంగా నేరం జరిగిన చోట 'క్లూస్' సేకరణకు సంబంధించి పరీక్షను మొదటి రోజు నిర్వహించామన్నారు. విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబర్చేందుకు ఈ పోటీలు ఉపయోగపడతాయన్నారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారిని రాష్ట్ర స్థాయిలో నిర్వహించే డ్యూటీ మీట్‌కు పంపిస్తామన్నారు. కార్యక్రమంలో అదనపు డీసీపీలు బస్వారెడ్డి (అడ్మిన్), రామ్‌చందర్‌రావు(ఏఆర్), సీసీఎస్ ఏసీపీ నాగవేంద్రచారి, జగిత్యాల, నిజామాబాద్, నిర్మల్, ఆదిలాబాద్ సీఐలు, ఏఎస్సైలు, తదితరులు పాల్గొన్నారు.

టేకు చెట్ల నరికివేత



కొలతలు తీసుకుంటున్న రేంజ్ అధికారి

జన్నారం: జన్నారం అటవీ డివిజన్‌లోని కవ్వాల్ సెక్షన్ పరిధిలో విలువైన టేకు చెట్లు నరికివేతకు గురైన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కలప స్మగ్లర్లు గుట్టు చప్పుడు కాకుండా కవ్వాల్ బీట్ బోడగుట్ట ప్రాంతంలో మూడు టేకు చెట్లను నరికి తీసుకెళ్లినట్లు తెలిసింది. అయితే సంఘటన జరిగి వారంరోజులైనా అటవీశాఖ అధికారులు గుర్తించకపోవడం గమనార్హం. బుధవారం అడవికి వెళ్లిన ఓ వ్యక్తి గమనించడంతో విషయం బయటకు వచ్చింది. విషయం తెలుసుకున్న అధికారులు ఆ ప్రాంతానికి వెళ్లి నరికివేతకు గురైన చెట్ల కొలతలు సేకరించారు.

అధికారుల నిర్లక్ష్యంతోనే..

కవ్వాల్ సెక్షన్ పరిధిలో పనిచేసే అధికారులు నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తున్నట్లు ఈ సంఘటన ద్వారా తెలుస్తోంది. రాత్రి వేళ పెట్రోలింగ్ నిర్వహించకపోవడం, సిబ్బంది స్థానికంగా ఉండక పోవడం వల్లే స్మగ్లర్లు దుశ్చర్యలకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. గతంలో రేంజ్ అధికారి శ్రీనివాస్ రాత్రి సమయాల్లో పెట్రోలింగ్ నిర్వహించి అడపా దడపా తనిఖీలు చేయడంతో స్మగ్లర్లు కాస్త వెనక్కి తగ్గారు. ఈ విషయమై ఇందన్‌పల్లి రేంజ్ అధికారి కారం శ్రీనివాస్‌ను సంప్రదించగా కలప స్మగ్లర్లు 3 టేకుచెట్లను నరికి తీసుకెళ్లినట్లు తెలిపారు. వాటి విలువ సుమారు 1.15 లక్షలు ఉంటుందన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఘటనపై విచారణ జరుపుతున్నామన్నారు. బాధ్యులపై శాఖ పరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

రూ.21.50 లక్షల విలువైన మద్యం ధ్వంసం

- ఎమ్మెల్సీ ఎన్నికల సమయంలో పట్టుకున్న అధికారులు



రోలర్‌తో ధ్వంసం చేస్తున్న మద్యం సీసాలు

చింతలమానెపల్లి: కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో టీచర్స్, గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఎన్నికల సమయంలో పట్టుకున్న రూ.21.50 లక్షల విలువైన మద్యాన్ని ఎస్పీ కాంతిలాల్ పాటిల్, జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌శాఖ అధికారి జ్యోతి కిరణ్ పర్యవేక్షణలో బుధవారం పోలీసులు ధ్వంసం చేశారు. ఎస్పీ కాంతిలాల్ పాటిల్ వివరాలు వెల్లడించారు. ఫిబ్రవరి 25న చింతలమానెపల్లి మండలంలోని గూడెంలో అక్రమంగా మద్యం నిల్వ ఉంచారనే సమాచారంతో పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో స్థానిక వైన్స్ నుంచి తరలించి అక్రమంగా ఓ బెల్టుషాపులో నిల్వ ఉంచిన రూ.21.50 లక్షల విలువైన మద్యం స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కోర్టు ఉత్తర్వుల మేరకు 10,155 బీరు బాటిళ్లు, మరో 300 విస్కీ సీసాలను బుధవారం పోలీస్‌స్టేషన్ ఎదుట రోడ్డుపై వరుసగా పేర్చి రోలర్‌తో ధ్వంసం చేశారు. పగిలిన సీసాల నుంచి మద్యం వరదలా ప్రవహించింది. కార్యక్రమంలో కాగజ్‌నగర్ డీఎస్పీ రామానుజం, కౌటాల సీఐ ముత్యం రమేశ్, ఎక్సైజ్ సీఐ రవికుమార్, చింతలమానెపల్లి ఎస్సై ఇస్లావత్ నరేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

క్యాన్సర్ బాధితులకు రిమ్స్‌లో మెరుగైన వైద్యం



మాట్లాడుతున్న రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్

ఆదిలాబాద్‌టౌన్: క్యాన్సర్ బాధితులకు రిమ్స్‌లో మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నట్లు డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ తెలిపారు. బుధవారం రిమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్యాన్సర్ వైద్య నిపుణుడు జక్కుల శ్రీకాంత్ బాధ్యతలు చేపట్టిన సంవత్సర కాలంలో 300లకు పైగా క్యాన్సర్ ఆపరేషన్‌లు చేశారన్నారు. తాజాగా ఆహారనాళం సర్జరీ ఓపెన్‌లో కాకుండా ల్యాప్రోస్కోపీ ద్వారా నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఇటీవల కాలంలో నాలుగు క్లిష్టమైన సర్జరీలను పూర్తి చేసినట్లు తెలిపారు. త్వరలో కిడ్నీ మార్పిడి ఆపరేషన్లకు ప్రణాళికలు చేస్తున్నామన్నారు. కార్డియాలజీ వైద్యులను నియమించేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. సమావేశంలో వైద్యులు సత్యనారాయణ, కార్తీక్, నరేందర్, దేవిదాస్, తదితరులు పాల్గొన్నారు.

'సమ్మెతో కేంద్రానికి కనువిప్పు కలగాలి'

శ్రీరాంపూర్: ఈనెల 9న చేపట్టనున్న సమ్మెను విజయవంతం చేసి కేంద్రానికి కనువిప్పు కలిగించాలని సింగరేణి కార్మిక సంఘాల జేఏసీ నాయకులు పిలుపునిచ్చారు. బుధవారం శ్రీరాంపూర్‌లోని ఓపెన్‌కాస్ట్ గనిలో గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ అధ్యక్షుడు వీ.సీతారామయ్య, టీబీజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మిరియాల రాజిరెడ్డి, సీఐటీయూ అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి, ఐఎఫ్‌టీయూ అధ్యక్షుడు విశ్వనాథం, ఐఎన్టీయూసీ ప్రధాన కార్యదర్శి ఏనుగు రవీందర్ రెడ్డి మాట్లాడారు. కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను, సదుపాయాలను నేడు కేంద్రం కాలరాస్తూ కొత్త కార్మిక చట్టాలను తీసుకువచ్చిందన్నారు. 4 లేబర్ కోడ్‌లు అమలు చేస్తే 12 గంటల పాటు బానిసల్లా పని చేయించుకునే చట్టం చేశారన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేసి పెట్టుబడిదారులకు కట్టబెట్టేందుకు ఈ చట్టాలను చేశారన్నారు. సమావేశంలో బాజీ సైదా, జెట్టి శంకర్ రావు, జీవన్ జోయల్, చంద్రశేఖర్, కేతిరెడ్డి సురేందర్ రెడ్డి, బండి రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

పందుల యజమానుల మధ్య గొడవ

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని ఓ వ్యక్తికి చెందిన పందులు తప్పిపోగా పెద్దమనుషుల సమక్షంతో పంచాయితీ జరుగుతుండగా ఇరు వర్గాలు దాడి చేసుకున్న ఘటన చోటు చేసుకుంది. పట్టణంలోని జాఫర్‌నగర్ ఏరియాలో చింద్యాల శివకు చెందిన 5 పందులు ఇటీవల కనిపించకుండా పోయాయి. వాటి కోసం గాలిస్తుండగా హైటెక్ సిటీ ప్రాంతంలో నివాసముంటున్న వినయ్ వద్ద రెండు పందులను గుర్తించారు. అవి నావంటే నావని గొడవపడ్డారు. బుధవారం పెద్దమనుషుల సమక్షంలో పంచాయితీ జరుగుతున్న క్రమంలో ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. ఈ దాడిలో జై కిషన్, రాంకిషన్, జోగేందర్, అరుణ్, బాపుకు గాయాలు కావడంతో ఆస్పత్రికి తరలించారు. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు సీఐ ప్రమోద్ రావు తెలిపారు.

మెమొంటోలు ఆవిష్కరించిన ఎంపీ



మెమొంటోలు ఆవిష్కరిస్తున్న ఎంపీ వంశీకృష్ణ

జైపూర్: రాహుల్‌గాంధీ ప్రారంభించిన సంవిధాన్ లీడర్‌షిప్ ప్రోగ్రామ్-వైట్ టీషర్ట్ ఇనిషియేట్‌లో భాగంగా బుధవారం ఇందారం వద్ద ఎంపీ వంశీకృష్ణ మెమొంటోలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత రాజకీయాల్లో రాణించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ వైస్‌ప్రెసిడెంట్ మహమ్మద్ ఇలియాజుద్దీన్ పాల్గొన్నారు.